# తీరని సమస్య

ద్రౌపది రంభ అని ఎవరూ ఎన్నడూ అనలేదుగాని, పదేళ్ళక్రితం కూడా ఎరిగినవాళ్ళు, "దానికేం! చక్కగా, కనుముక్కుతీరుగా ఉంటుంది" అనుకునేవాళ్ళు. ఇప్పుడెవరన్నా దాని పెళ్ళి విషయం మాట్లాడేటప్పుడు, "ఆc, ఏంచూసి చేసుకుంటారు, బాబూ? వాళ్ళనాన్న ఇచ్చే కట్నం చూశా? దాని అందచందాలుచూశా?" అని చప్పరిస్తున్నారు. ద్రౌపది మారిపోయింది.

ఎందుకు మారదూ? ఇరవై తొమ్మిది కూడా వెళుతుంది, ఇంతవరకూ పెళ్ళి కాలేదు. అయేటట్టు కూడా లేదు. బియ్యే పాసయింది. ఉద్యోగం లేదు. అన్న కామేశ్వర్రావు రెక్కలమీద సంసారం నానా అగచాట్లుగా వెళుతున్నది. అతనికి అప్పుడే ఆరుగురు పిల్లలు, రోగిష్టి పెళ్ళాం. పిల్లల్ని కనటానికి తప్ప మిగతా అన్ని పనులకీ ఆవిడకి రోగమే. ఆ రోగిష్టి పెళ్ళాన్ని కనిపెట్టుకుని ఉండేటందుకు రోగిష్టి అత్తగారు. ఒక జల్లు పడ్డా, కాస్సేపు నీళ్ళల్లో నానినా ఆవిడకి కాళ్లుపట్టుకు పోయి యమబాధ పడుతుంది. ఆచారవంతురాలు గనక నీటిలో నానటం రోజూ ఉంటుందనే చెప్పొచ్చు. ముసలాయనకి – అంటే ద్రౌపది తండ్రికి – ఆస్తి పోయిన నాటినుంచి మతి సరిగాలేదు. అస్తమానం ఇంట్లోనే కూచుంటాడు. ఇంటి ఇబ్బందులన్నీ ఆయన్ని, పాపం, బాధిస్తూంటాయల్లే ఉంది. వాటిని గురించే మననం చేస్తూ ఉంటాడు. ఎప్పుడన్నా కామేశ్వర్రావు తండ్రి మీద విసుక్కుంటాడు.

"ఆర్చేవాడివా, తీర్చేవాడివా? నీ కెందుకయ్యా? ఏం రోగాలో, ఏం బాధలో, ఏం దరిద్రమో మేం పడుతున్నాంగా? వేళకింత తిని హాయిగా కూచో, ఏ బాధా లేదనుకో."

ముసలాయనకి అది యిష్టంలేదు. ఎద్దుదున్నితే జోరీగ రొప్పిందన్నట్టు, నిజమైన శ్రమంతా కామేశ్వర్రావు పడుతుంటే, అతనికి సానుభూతిగా కాబోలు, కర్మ, ముసలాయన మూలుగుతూ ఉండేవాడు. అటువంటి పరిస్థితిలో కామేశ్వర్రావే తనని కోప్పడేసరికి ఆయనకి కష్టం వేసేది. వెంటనే ద్రౌపది మీద విరుచుకుపడేవాడు

"నీ మొహం తగలెయ్యా, నీ చదువు చట్టుబండలుగానూ! నా ఆస్తంతా నీ చదువుకిందే ధారపోశానే! నీ చదువంతా పెట్టి ఒక్క రూపాయి సంపాదించగలవుటే! ఆ డబ్బంతా వాడికింద ఖర్చు పెట్టి ఏ ఇంగ్లండో పంపిస్తే వాడికి వేలకు వేలు జీతం వచ్చి

ఉండునుగదే! వేలకువేలు! నీ మొహాన దేవుడేం రాత రాశాడో గాని నిన్నెవడూ పెళ్ళయినా చేసుకోడేమే? కుంటివాళ్ళకీ, గుడ్డివాళ్ళకీ క్షణంలో పెళ్ళవుతుందిగాని నీకు మటుకు కాదే! నీ కసలు మొగుడంటూ పుట్టి ఉంటేగా?"

వీటన్నిటికి ద్రౌపది సమాధానం చెప్పగలదు. కాని ఏమిటి లాభం? ఒక్కోసారి ఈ మాటలకు ద్రౌపది ఏడిచేది, కాని పైవాళ్ళు, "ఛీ, ఊరుకో, మతి లేనివాడి మాటలు పట్టించుకుంటారా?" అని సముదాయించేవాళ్ళు. సముదాయింపు సులభం. గురి లేనివాడు రాయి విసిరినా, తగిలితే నొప్పెత్తుతుంది. మతిలేని వాడితో కలిసి ఉంటూ మతి గలిగిన మనిషల్లే ఏళ్ళ తరబడి ఉండటం చాలా కష్టం. పిచ్చీ, హిస్టీరియా మొదలైనవి మానసిక అంటు వ్యాధులు... ద్రౌపదికి అనేకసార్లు సందేహం కలిగింది, తనకు మతి సరిగా ఉందా అని....

ఇంటిల్లిపాదికీ పని చెయ్యటానికి ఆరోగ్యంగా ఉన్న మనిషి ఇంటి కంతకీ ద్రౌపది ఒకతే. ఆమె ఆ యింట్లో చేసేపని ఎవరన్నా సంపన్నులకి చేస్తే నెలకొక వంద రూపాయిలిస్తారు కానీ, కామేశ్వర్రావేం ఇవ్వగలడు. అతను తెచ్చుకునేదే నూటపాతిక. అందుచేత ద్రౌపది ఈ చాకిరీ యావత్తూ తన సొంతానికనుకునే చెయ్యాలి.

దురదృష్టవశాత్తూ ఈ కొంపలో ఈ చాకిరి తప్పిస్తే ద్రౌపదికి సొంతం ఇంకేమీలేదు. ఈ ఇల్లు తనదనీ, ఈ ఇంట్లో తనకు సహజమైన స్థానం ఉందనీ ద్రౌపది విశ్వసించటం మానేసి అయిదారేళ్ళయింది.

ముసలాయన మతి పూర్తిగా చెడక మునుపే "దీని పెళ్లయితేనేగాని నాకు మంచిరోజులు రావు. చక్రం చూసిన వాడల్లా ఆ మాటే అంటున్నాడు" అని ప్రారంభించేడు. కాలక్రమేణా ఈ పాటికి చాలా సంగతులు చేరాయి. "రోజూ లేచి దీని మొహం చూసి బయటికి వెళ్ళితే ఎవడూ ఎర్ర ఏగానీ చేతిలో పెట్టడుగదా?"....... "దీనికి పెళ్ళయేదేమిటి? నా అదృష్టం తిరిగేదేమిటి?" .... ముసలాయన అట్లా ఎడమైపోయాడు.

కామేశ్వర్రావు మరో రకంగా ఎడమై పోయినాడు. అతను చెల్లెల్ని పోషించ లేకపోవటం గాని, ఎట్లాగైనా ఆమె పెళ్ళి అయిపోయి కాపరానికి వెళ్ళిపోతే తన భారం కొంత తగ్గుతుందనుకోవటంగాని అయితే ద్రౌపది అంతగా విచారించి ఉండదు. ఆమె కూడా చదువుకున్నదే. అర్థం చేసుకోగలదే. కాని కామేశ్వర్రావు అచ్చగా అంతటితో ఆగలేదు. ఆమెకు వొట్టి చచ్చు సంబంధాలు తెచ్చి ముడిపెట్టాలని తొందర పడ్డాడు. అందమూ, గుణమూ లేనిచోట డబ్బుకోసం గడ్డితినే వాళ్ళనే మనం ఎంతో నీచంగా చూస్తాం. అందమూ, గుణమూ, డబ్బూ కూడా లేని దిక్కుమాలిన వెధవలకి తన చెల్లెల్ని అంటగట్టాలని చూశాడు కామేశ్వర్రావు. ఆ సంబంధాలను గురించి ద్రౌపదితో అబద్ధాలాడి

దొరికిపోయినాడు. ఆమె వొదిలిపోతే చాలు, అవతల ఆమెగతి ఏమైనా సరే అనే స్థితికి అతను వచ్చాడని తెలిసినాక ద్రౌపది అన్నని పరాయివాడికింద కట్టేసింది. అంత అసమర్థపు స్థితిలో ఉన్న అన్నని పరాయివాడికింద కట్టటం కంటే ఇంకేవిధంగా శిక్షించగలదు?

అతనికి తనమీద సోదర ప్రేమ లేకపోతే లేకపోయింది; తన పిల్లలకీ, పెళ్ళానికీ, చివరకి అత్తగారికీ కూడా చచ్చేట్టు చాకిరీ చేస్తున్నందుకు కామేశ్వర్రావు తన మీద ఆపాటి కృతజ్ఞత చూపగూడదా? ఏ భ్రష్టుణ్ణో, అతనిమాట చొప్పునే పెళ్ళాడి తనదారిన తాను కాపరం వెళ్ళిపోతే మర్నాడు ఈ కుటుంబం గతి ఏం కాను? ఆ సంగతి అతను ఆలోచించలేడా?

తన తండ్రీ, అన్నా దూరమైనాక ఆ ఇంట్లో ద్రౌపదికి దగ్గిరవాళ్ళెవరు? ఈ విషయాలన్నీ ఎవరితో చెప్పుకుంటుంది? బయటికి అనుకోవటానికి లేని ఈ బాధ ఆమె మనస్సును తొలచి డొల్ల చెయ్యసాగింది. ఇది ఆమె జీవితానికి తెగని సమస్య. ఇందులో పెళ్ళీ, డబ్బూ, స్వేచ్ఛా - ఈ మూడిటి తాలూకు పోగులూ చిక్కుపడి ఉన్నై.

ద్రౌపది తనకు పెళ్ళి కాలేదని మనోవ్యాధి పాలు కావటం ఇతరులకెంత సహజంగా కనిపించినా, ఆమె విషయంలో అది కృత్రిమంగా తయారయిన సమస్యే. ఎందుకంటే ఒకప్పుడు ఈ తండ్రే ఆమె జీవితానికి చదువే ముఖ్యమైన విషయంగానూ, పెళ్ళి అముఖ్యంగానూ మాట్లాడాడు. ఒకప్పుడామెను చేసుకుంటామని వచ్చిన సంబంధాలు తోసేసి, అవమానించాడు. అది ఆయనకు జ్ఞాపకంలేదు. ద్రౌపదికి జ్ఞాపకం ఉంది. అదికాక మొగుడు లేడనే చింతే అయితే ఏ ఆడదాన్నీ కుంగదీయదు; మొగుళ్ళు పోయి వైధవ్యం మీదపడి రాళ్ళల్లే ఉన్న వితంతువులు చాలామంది ఉన్నారు.

కాని ఆ వాతావరణంలో ఇప్పుడు ద్రౌపది మామూలు మనిషికాదు. ఆమెకిప్పుడు పెళ్లి తప్ప గత్యంతరం లేదు. ఈ ఇల్లూ, వాతావరణమూ వొదిలించుకోవాలంటే పెళ్ళి తప్ప మరో మార్గంలేదు. పెళ్లయితే మిగతా సమస్యలన్నీ తీరుతాయి. ఎంతకీ ఆ పెళ్ళే కాకుండా ఉంది.

నేను మబ్బుల్లో కూచుని నిజం తెలుసుకోకుండా ఉన్నానా? కామేశ్వర్రావు నన్ను చేసుకోమన్న సంబంధాల కంటే నాకు మంచివి రాదగవా? అతను నా యోగ్యత సరిగానే అంచనాకట్టాడా? నన్ను గురించి నాకు ఎంత అధమమైన అభిప్రాయం తెచ్చిపెట్టుకున్నా, ఇతరులకు నా మీద ఇంకా తక్కువ అభిప్రాయం ఉన్నట్టుగా తోస్తుందే! ఏమిటి కారణం? ఇంకా ఎంతని కుంగను? దానికి అంతెక్కడ? అనుకునేది ద్రౌపది. ఒక్కసారి ఆమెకి ఆత్మవిశ్వాసం ఏమీ లేకుండాపోయి ఈ సారి ఎవడన్నా పెళ్ళిచేసుకుంటానని వస్తే కళ్ళు మూసుకుని ఒప్పేసుకుంటాను. నే ననవసరంగా ఎందుకు మధనపడాలి? నిండా మునిగిన

వాడికి చలేమిటి? ఏ పెళ్ళి చేసుకున్నా ఇంతకన్నా దరిద్రంగానూ, నిర్బంధం గానూ ఉండదుగదా? ఏదైనా ఉన్నవాళ్ళకి పోతుందని భయంగాని, ఏమీలేని నా బోటి దానికి పోయేదేమిటి? ఈ సారి ఎవడు వచ్చినా చేసుకుంటాను. ఇది నిశ్చయం, అనుకునేది.

ద్రౌపదికి పరీక్షగా ఒక సంబంధం వచ్చింది. వరుడికి యాభై అయిదేళ్ళు. ఇటీవల భార్య పోయింది. అయిదారుగురు సంతానం. ఆయనకి తల్లిదండ్రులున్నారు. తండ్రికి పిచ్చి, తల్లి వ్యాధి పీడితురాలు, ఆచారవంతురాలైన విధవ చెల్లెలొకతె ఉంది. చిన్న పిల్లని చేసుకోమని ఆవిడ గోలట. ఈయన కాస్త లోకజ్ఞాని. పెద్దదాన్నే చేసుకుంటానని వచ్చాడు. ద్రౌపదిని చూసి వెళ్ళాడు.

ఆయన విషయాలన్నీ వినగానే ద్రౌపదికి ఆపుకోలేకుండా నవ్వొచ్చింది. ఈ పెళ్ళయితే తన జీవితంలో ఏమీ మార్పుండదు. ఇక్కడ ఉన్న మనుషులకు నకళ్ళే వాళ్ళూనూ, వీళ్ళు చూసినట్టే తనను వాళ్ళూ పరాయిగా చూస్తారు. ఎందుకీ పెళ్ళి?

"నా కక్కర్లేదీ సంబంధం!" అందామని నోటిదాకా వచ్చింది. కాని బలవంతాన నోరు నొక్కేసుకుంది.

మర్నాడు కామేశ్వర్రావు కబురు తెచ్చాడు. ఆ పెద్దమనిషికి ద్రౌపది మరీ సన్నగా, జబ్బుగా కనిపించిందిట. ఆయన ఇంకో సంబంధం - పద్దెనిమిదేళ్ళ పిల్లని - స్థిరపరచుకున్నాడట.

*మొదటి ముద్రణ: తెలుగు స్వతంత్ర, 6 ఆగస్ట్ 1948*